
పల్లెల పంచాయతీల్లో పాస్టర్లు దూకినాకే మనుష్యుల మనసుల్లో సాతాన్లు దూరినయి. చాచబడిన పాస్టర్ల హస్తాలు మనుషుల ఎదుగుదలకు అడ్డుగోడలుగా మారబట్టే సిలువపై దేవుడు చాచిన హస్తాలకు ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

ఇండ్ల చంద్రశేఖర్

# 16

# దేహయాత్ర

చారి పి.ఎస్.





మనిషి చచ్చిపోయేడు. పెళ్లాం, కూతురు, అమ్మ, వాళ్ల తరుపోల్లు అందరూ ఏడుస్తున్నారు. సినజాలయ్య మాత్రం ఏడవడం లేదు కొడుకయ్యి వుండీ కూడా. యాతన పడుతున్నాడు. ఆయన మనసులో వున్న విషయాన్ని అక్కడున్నోల్లందరికి ఎలా చెప్పాలో తెలియక సతమత మయిపోతా మొద్దుబారిన కాలిగోల్లని నోటితో కొరుక్కుంట చర్చీ పక్క నున్న అరుగుమీద కూసోనున్నాడు. గబక్కన సూపు చర్చీ వైపుకి తిరిగింది. రంగు రంగుల్లో ఉండాల్సిన చర్చీ తెల్లగా పాలిపోయినట్టు కనపడింది. సిలువ, గంట స్తంభం, ఏసుక్రీస్తు బొమ్మ ఆయనేసుకున్న గుడ్డలు అన్నీ తెల్లగా కనపడ్డాయి. సీరియల్ లైట్లు, చెమ్కీలు, రంగుకాయితాలు ఏవి కనపడలా తెల్లగోడలు వాక్యాలు తప్ప. ఆ చర్చీని అట్టా సూడలేక పోయాడు. భయమేసింది. రెండో రాకడ వచ్చిందేమోనని బయపడి కళ్లు నలుపుకొని మళ్లీ చూసేడు. ఈసారి మామూలుగానే కనపడింది. సెమట్లు పట్టినియ్. తుండుగుడ్డతో సెమట్లు తుడుచుకొని మామూలు మనిసయ్యేడు.

ఎవురో కొత్తమనిషి చచ్చిపోయినాయన దగ్గరకి వచ్చాడని పెద్దగా వినపడుతున్న ఏడుపులు తెలుపుతున్నాయి సినజాలయ్యకి. ఆ గోలకి మళ్లీ వాళ్ల నాయన చనిపోయాడన్న విషయం గుర్తుకొచ్చి గట్టిగా గాలి పీల్చుకున్నాడు. దూరంగా బండి శబ్దం వినపడింది. గత్తర గత్తరగా రోడ్లోకి పోయి చూసేడు. గుండెలు జారినియ్ సినజాలయ్యకి ఆ బండిమీద వస్తున్న పాస్టర్‌ని చూసేతలికి. జారిపోయిన గుండె కిందపడిద్దనుకున్నాడో ఏమో లుంగీ నడుంపైకి ఎగ్గట్టి చెవులో వున్న సగం కాలిన బీడీని ముట్టిచ్చి ఒక్క దమ్ములో అరబీడి కాలిపోయేలాగా పీలుస్తా గబాగబా ఇస్సాకోల్ల బజారువైపుకి కదిలాడు.

"ఏంద్రా జాలా ఇంత పని చేసేడో మీ నాన్న, నిన్ననేగదంటయ్య బొంకాడికి పోయ్యోత్తంటే ఎందప్ప బాగున్నావంటమే అని పలకరిం చేడు, తెల్లారేసరికల్లా ఇట్ట జరిగినా," అని ఏడుత్తున్నట్టు సినజాలయ్య రెండు చేతులు పట్టుకొని ఆపింది నరసమ్మ.

"సర్లే నువ్వు మా ఇంటికి పో నాక్కొంచెం అర్జెంటు పనుంది," అని ఆమె మొఖం కూడా చూడకుండా ముందుకి కదిలేడు.

వేగంగా నడుత్తుంటే అడుగేసి తీసినప్పుడల్లా రబ్బరు చెప్పులు పటపటమని అరికాళ్లకి తగులుతున్నాయి. ఎదురొస్తున్న బండ్లనిగాని, సానుభూతిగా చూస్తున్న జనాలనిగాని అస్సలు పట్టించుకోవడంలేదు. ఇట్టాంటిది ఇంతకుమునుపెప్పుడన్నా జరిగుంటే కొంచెం నిమ్మళంగా వుండేవోడు. ఖర్మకి ఇదే మొదటిసారి అట్టా జరగడం. ఊరెంత గోల చేసిద్దో, పెద్దమనుషులేమంటారో, అసలు ఒప్పుకుంటారో ఒప్పుకోరో, ఇంటిపక్కనే వుండే పాస్టర్ మొఖం రేపట్నుంచి ఎట్ట చూడాలో, వీల్లొప్పుకోకపోతే వాల్లేమనుకుంటారో ఆలోచిస్తా ఇస్సాకోల్ల బజారు కెల్లాల్సినోడు కాస్తా సమాధులసాయ పోయేడు.

ఆనందుబాబు సినజాలయ్యని చూసి సమాదులతోటలో నుంచి లగుదోలు కుంటా బయటకొచ్చి,

"మామో ఏంది మామా నువ్వోచ్చావా? మేందియ్యమా గుంట నువ్వాడికి పొయి జరగాల్సిన పనులు చూడుపో," అంటా భరోసా ఇయ్యబోయాడు.

"నేనోచ్చింది అందుక్కాదులేరా," గొనిగినట్టు అంటా ఇంకో బీడీ ముట్టిచ్చేడు సినజాలయ్య.

"ఏమయ్యింది మామ?" తన ఆందోళనని పసిగట్టి అడిగాడు ఆనందుబాబు.

"ఒరేయ్ ఆనందుగా నిన్నొక విషయం అడుగుతాగాని అది తప్పో ఒప్పో నువ్వు చెప్పు," అంటా బీడీని గట్టిగా పీల్చి నోట్లో పొగని రెండు వూదుల్లో బయటకి పంపి, బీడిని బొట్నేలు మద్దేలు మద్దిలో పెట్టి సైడ్ కాలవలోకి ఇసిరేసి, లుంగీని కిందకి లాగి తొడలమద్యలో దోపుకొని అక్కడే సప్టా మీద కూసున్నాడు సినజాలయ్య.

"ఏదో పెద్ద ఎవ్వారంలాగనే వుందే... ఏంది మామ ఏంది సంగతి, మీ అయ్యని కాజేసింది నువ్వేనా ఏంది కొంపదీసి," అంటా నవ్వుతా పక్కనే కూర్చున్నాడు అనందుబాబు.

"అసె మూసుకోరా ఎప్పుడేమి మాట్లాడాలో తెలియదు నీకో," అంటా కొంచెం కోపంగా చూసేడు ఆనందుబాబువైపు సినజాలయ్య.

ఫోనొచ్చింది సినజాలయ్యకి.

"పాస్టరుగోరు సెప్పండి," అన్నాడు ఫోనెత్తి.

వినడానికి ప్రయత్నిస్తున్నాడు ఆనందుబాబు. సినజాలయ్య ముఖంలో నవ్వడానికి ప్రయత్నిస్తున్న ఆందోళన స్పష్టంగా కనిపిస్తుందిగాని ఫోనులో విషయం మాత్రం వినపడటంలేదు ఆనందుబాబుకి.

"సరేనయ్యా నేను కొంచెంసేపాగి ఫోన్ చేస్తా... మీరప్పుడు రావచ్చులే అప్పుడే రాబాకండి," అంటా ఫోన్ పెట్టేసేడు.

“ఏమంటున్నాడు పాస్టరు, తొందరగా ప్రార్థన చేసి పెట్టెలో పెడదామను కుంటున్నాడా ఏంటి?” అన్నాడు అనుమానంగా ఆనందుబాబు.

“అసె మన పాస్టరు కాదులేరా,” అన్నాడు ఫోన్ జేబిలో పెట్టుకుంటా.

“మన పాస్టరు కాకుండా ఇంకేవురే నీకు ఫోన్ చేసేదే,” ఆశ్చర్యంగా మొఖం పెట్టి అడిగేడు అనందుబాబు.

“అదేరా మా నాన్న పోతల్లా వూళ్లో చర్చికి... ఆ పాస్టరు,” అన్నాడు సిన జాలయ్య.

“ఎవురో ఆ పెంతికోస్తు చర్చి వోల్లా... ఏందంట వాళ్ల బాధ.”

“మా నాన్న పెంతికోస్తు సంఘానికి పోయేవోడు కదా, వాళ్లతో ప్రార్థన చేపిచ్చి గుంటలో పెట్టిద్దామని అనుకుంటున్నా. దాని విషయమే కనుక్కుందామని ఆ చర్చి పాస్టరు ఫోన్ చేసేడు,” అన్నాడు ఆనందుబాబు మొఖంలోకి చూస్తా.

“మీ అబ్బాబాబులు ఇద్దరు కలిసి ఊరిని సీలగొట్టాలని నిర్ణయించుకున్నట్టు ఉన్నారుగా,” అంటా కోపంగా పైకి లేసేడు ఆనందుబాబు.

మళ్లీ సినజాలయ్య జేబిలో ఫోన్ మోగింది.

“అయ్యా పాస్టరుగోరు అదే మాట్లాడుతున్న... ఏంది మా పల్లెకి బయలు దేరేరా?” మాట్లాడుతూ చివ్వుక్కున పైకిలేసేడు.

“ఒరే నాయాల్లారో ఇది జరిగేపని కాదులే. గుంటాపి రండి, ఆ పెంతి కోస్తోల్లె వచ్చి తవ్వుకుంటారు,” అని అరిచేడు అనందుబాబు.

గుంట తవ్వుతున్న కుర్రోళ్ల వైపుకి వెళ్తా సెప్పి సెప్పంగల్లోనే గుంట తవ్వడం ఆపి తలా ఒక బజార్లోకి పరిగెత్తడం మొదలెట్టారు కుర్రోల్లంతా.

* * *

“ఈ కులపెద్దలు కుల్లోల్లు అవబట్టికదా మన సంగానికి ఈ పరిస్థితి వచ్చింది,” అన్నాడు బాగా తాగున్న జెబులోను.

“నాయాల్లారా ఆ తాగుబోతున్ని పక్కకన్నా తీసకపొండ్రా ఏ మాటెటోచ్చేదో కూడా అర్థం కాకుండా మాట్లాడుతున్నాడు నాయాలు,” అన్నాడు ఒక కులపెద్ద.

“అసలు ఈ మీటింగేదో తొలిసూరిగా ఆ చర్చికి పోయినోడిని పిలిచి పెట్టుంటే అప్పుడే తేలిపోయేది. అప్పుడేమో ఎవురిష్ట ప్రకారం వాళ్లని వోదిలితిరే. వాళ్లేమో ఆ పెంతికోస్తు సంఘం వోల్లని ఏకంగా పల్లెకే తీస్కొనివత్తంట్రే,” వాపోయాడు ఆ మీటింగులో ఒక మూలాన కూర్చొని చుట్ట చుట్టుకుంటా ప్రసాదు.

కులపెద్దలు అయిదుగురు గోడకానుకొని ఎవురి మొకాల్లోకి సూడకుండా తలకాయలు మోకాళ్ల మద్యలోకి వేలాడదీసుకొని, ఒకరేమో సీపిరిపుల్లతో చీమని వేటాడుతున్నాడు. ఇంకోకాయనేమో పళ్ల మద్యలో ఇరుకున్న ఎండుతునకల కూరని

పుల్లతో లోడతున్నాడు. ఒకాయనేమో స్క్రీను పగిలిపోయిన పాత నోకియా ఫోనులో ఎవురిదో నెంబరు కోసం వెతుకుతున్నాడు. ఇద్దరు పెద్దలేమో పక్కనున్నోడికి కూడా వినపడకుండా ఏదో గోనుక్కుంటున్నారు.

"నాయాల్లారా సచ్చిపోయిన మనిషిని ఇంట్లో పెట్టుకొని ఈ మీటింగులేన్రా నాయాల్లారా తొందరగా తెమిల్చి ఏదొక మార్గం చెయ్యకుండా," అసహనానికి గురయ్యేడు చినంకయ్య.

"అసె అదికాదురా సామే, ఏమి మన పాస్టరు ప్రార్థన చేస్తే గుంటలో పనుకో నన్నాడా ఏందా మనిషి. నాయాల్ది ఈ పాటికి బూడ్చి పెట్టికూడా వొచ్చేవాల్లమి. ఈ జాలడు చేసిన పనికదా ఇదంతా," అరిచినట్టు మాట్లాడేడు కోటయ్య

"అబ్బాయ్ జాలయ్య సరే మీరేదో ఆ సంగానికి పొతేపోయేరు దానికి మేమేమి అనడంలా. ఈ పల్లెల్లో ఇదివరికెప్పుడూ ఇట్టా జరగలా, మనది బాప్టిస్టు సంఘం ఈనాటిదికాదు. గత యాబయ్యేల్ల నుంచి మనం రెండో సంఘాన్ని ఊళ్లోకి అడుగు బెట్టనియ్యలా. అంత పెద్ద సరిత్ర వుంది దీనికి. ఏ సంఘమోల్లయినా పార్థన చేసేది యేసుక్రీస్తుకే కదా... ఇంకేవురో ఎందుకు మన పాస్టరే ప్రార్థన చేసి మీ అయ్యని భూస్థాపితం చేస్తాడులే. వాళ్లకి ఫోన్ చేసి చెప్పు రావద్దని. మేము మిమ్మల్నయితే ఆ సంఘానికి పోవద్దు అని కట్టడి చెయ్యలేదుగా," నోరు తెరిచాడు కులపెద్ద హగ్గయ్య.

"మా నాన్న చివరి కోరిక మామ, పెంతికోస్తూ సంఘం వాళ్లతో భూస్థాపితం చేపిచ్చుకోవాలని," గొనిగేడు సినజాలయ్య.

"ఒరే జాలో నీ నంగనాచి మాటలు మాకాడ చెప్పబాకా. ఇప్పుడు మన పాస్టరు ప్రార్థన చేసి పెట్టిలో పెడితో చచ్చిపోయిన మీనాన్న లేచొచ్చి నిన్ను చెప్పుతో కొడతాడా?" వెటకారంగా అడిగాడు జెబులోను.

"మామ నువ్వన్నట్టు ఎవురు ప్రార్థన చేసినా దేవుడికే కదా. వాళ్ల నాయన ఇష్టప్రకారం వాణ్ని వాళ్లతోనే ప్రార్థన సేపిచ్చుకోమను తప్పేముంది," అన్నాడు గుంపు లోంచి ఇర్మీయ.

"ఒసే నువ్వు కూడా ఆ పెంతికోస్తు సంఘానికి పోయేవోడివేగా, అందుకని సపోర్టు చేస్తన్నావని మాకు దెలుసులే. నువ్వు మూసుకో," కోప్పడ్డాడు మోహను.

"ఒరేయ్ మోహనుగా ఎక్కువ తక్కువులు మాట్లాడేవంటే దొమ్మలు పగుల్తియ్ నాయాల," ఇర్మీయ పైకి లేసేడు.

"లేకపోతే ఏందే... కమ్మగా అందరం కలసి ఒక సంఘం పెట్టుకొని నాయాల్ది ఎన్ని తగాదలొచ్చి తిట్టుకున్నా మళ్లీ పెల్లిల్లకో దినాలకో అందరం ఒకటవుతాం, ఆ పెంతికోస్తు సంఘానికి పోయేవోల్లు మన దినాలకి రారు, మన పెళ్లిళ్లలో ప్రార్థనలకి రారు. మొన్న మా అయ్యదినానికి సొంత సిన్నాయన కూతురు రాల. అడిగితే ఆ

సంఘానికి పోయేవోల్లు దినాలకి రాకూడదన్నాయ్ అనింది. ఏ బైబుల్లో సెప్పేరయ్యా దినాలకి పోకూడదని తాలిబొట్లు ఏసుకోకూడదని," గట్టిగట్టిగా అరిచేడు మోహను.

"ఒరేయ్ మోహనుగా ఇంకొక్కసారి ఆ సంఘం గురించి తప్పుగా మాట్లాడే వంటే నేనేం చేస్తానో నాకే తెలియదు," పిచ్చికోపంతో పళ్లు కొరికేడు ఇర్మియా.

ఆ పెంతికోస్తు సంఘానికి పోయే అయిదుగురారుగురు ఇర్మియా పక్కకి వచ్చి కూర్చున్నారు.

"కమ్మగా కలిసున్న పల్లెను కాజేస్తున్నారయ్య ఈ పాస్టర్లు," అన్నాడు ఎప్పుడూ చర్చికి వెళ్లని శేకరు.

"అబ్బాయ్ మంచిగా మాట్లాడు, మద్యలో పాస్టర్లు ఏమి చేశారు. మా తాత, మా నాయన, నేను ఈ సంఘంలో పుట్టి పెరిగినోల్లమి. దేవుడి సేవచేసుకునే వాళ్లమీ. మీ పల్లెల్లో తగాదాలు పెట్టాల్సిన అవసరం మాకేముంది. మీరెవుడితోనయినా ప్రార్థన చేపిచ్చుకోండి నాకేమి నేనెల్తా," అంటా పైకి లేచేడు పాస్టరు.

"నువ్వు మాత్రం తక్కువ తిన్నావా ఈ బాప్టిస్టు చర్చీని క్రీస్తు సంఘంలో కలపా లని నువ్వు నీకు చేతనయినన్ని యవ్వారాలు చెయ్యట్లా మా పల్లెల్లో వాళ్లతో సాటు మాటుగా, నాకు తెలియదనుకున్నావా?" శేకరు నిలదీసేడు.

పల్లెకి ఒళ్లు జలదరించింది ఆ మాట అనేతలికి, ఎక్కడోల్లక్కడ కొయ్యల్లా నిలబడ్డారు. కులపెద్దలు శేకరువైపు పాస్టర్‌వైపు మార్చిమార్చి చూస్తున్నారు. యవ్వారం చాల పొడుగు పోయేటట్టు వుందని సినజాలయ్య ఆదివారం కొయ్యబోయే దున్న కుర్రలా బిక్కు బిక్కుమని చూస్తున్నాడు.

"ఏం మాట్లాడుతున్నావయ్య నువ్వు ... అసలు నువ్వెప్పుడైనా ప్రార్థనకొచ్చేవా? అసలు నువ్వేమి మాట్లాడుతున్నావో అర్థం అవుతుందా... దైవజనుడ్ని పట్టుకొని నీ ఇష్టప్రకారం మాట్లాడతా వుంటే ఈ కులపెద్దలు ఇంతమంది జనాలు నోర్మూసుకొని చూస్తుంటేనే అర్థం అవుతుంది నీ చేత ఈ మాటలు ఎవరు మాట్లాడిస్తున్నారో. నా మీద అబండాలు వేస్తే దేవుడు చూస్తా వూరుకోడులే," ఊగిపోతున్నాడు పాస్టరు బండి వైపు గబగబా వెళతా.

"ఒరేయ్ దోవదప్పినోడో ఎవుర్ని పట్టుకొని ఏం మాట్లాడుతున్నావురా కళ్లు పోతాయిరా పాస్టర్‌గారిని అల్లాంటి మాటలంటే. నువ్వు నోర్మూసుకొని ఇంటికిపో," అంది శేకరు వాళ్ల నాయనమ్మ.

"వాడేదో తెలియక అన్నాడులే పాస్టరుగోరో, మీరు కూర్చోండి," అంటా చెయ్యి పట్టుకొని వెనక్కి లాగి కుర్చీ దగ్గరకు తీసుకొచ్చాడు యలమంద. పాస్టరు కోపంగా కుర్చీలో కూర్చున్నాడు. కాని కులపెద్దలు శేకరుని ఏమి అననందుకు మాత్రం చాలా బాధపడ్డాడు. కుట్రేదో జరుగుతుందని తనకున్న జ్ఞానంతో అనుకున్నాడు.

“సుట్టుపక్కల పల్లెల్లో వీధికొక సంఘం పెట్టుకొని కొట్టుకొని సస్తున్నారు, మా సంఘం గొప్పంటే మా సంఘం గొప్పని. సొంత అన్నల్దమ్ములే విడిపోతున్నారు ఈ సంఘాల వల్ల. వాళ్ల పెళ్లికి ఈళ్లు పోరు ఈళ్ల పెళ్లికి వాళ్లు రారు. మన పల్లెల్లోనే ఇప్పుడుదాక మొగోడితనంగా ఒక్క సంఘమే వుంది. అందరం ఒక్కమాట మీదే వున్నాం. దాన్నిగూడ కాజెయ్యండి, మనం కూడా కొట్టుకొని సద్దాం,” అరిసేడు శేకరు.

“ఒరే జాలా ఎందుకురా ఊరంతా గోలగోల లేపుతావ్... నాయాల నా మాటిని మన పాస్టరు చేత ప్రార్థన చేపిచ్చుకొని మీ అయ్యని గుంటలో పెట్టురా,” అన్నాడు ఇంకో కులపెద్ద ఏసేబు.

“మా నాన్న చివరి కోరిక మామ, ఆ పెంతికోస్తు సంఘం వాళ్లతో భూస్థాపితం చేపిచ్చుకోవాలని,” మళ్లీ అదే గొనిగేడు సినజాలయ్య.

“ఈ మాట తప్ప ఇంకో మాట చెప్పద్దని చెప్పేడేంది మామ మీ పాస్టరు,” నవ్వాడు ఆనందుబాబు.

అందరూ నవ్వారు. సినజాలయ్యకి మొఖం ఏడబెట్టుకోవాలో అర్థంకాలేదు.

“ఇదిగో సూడండి ఇప్పుడికే మన పల్లెల్లో వందకి పదిమంది ఆ పెంతికోస్తు చర్చికి పోతున్నారు, మనం సూసీసూడనట్టు వదిలేసెం. ఇప్పుడుగాని వాళ్లని ఇక్కడకి రానిచ్చేమంటే మాత్రం ఇక అందరు మొదలుపెడతారు, వాళ్లొచ్చి మన పల్లెల్లో రెండో చర్చి కట్టి పల్లెని రెండుగా విడగొట్టేస్తారు. మనపల్లె ఎప్పటిలాగా ఒక్కటిగా ఉండాలంటే మాత్రం మనం రెండో సంఘాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడికి రానియ్యకూడదు,” పెద్దగా సెప్పేడు మోహను.

“వాడన్న మాట అచ్చరాల నిజమబ్బాయ్, మీ సంఘంవోళ్లని నేను తప్పు బట్టటంలా, నిన్ను ఆడికి పోవద్దు అని అనడంలా. మన పల్లె ఒక్కటిగా కలిసుండటం కోసం వాళ్లని ఇక్కడికి రానిచ్చేదిలేదు. ఇక నీ ఇష్టం. మీ అయ్యని మన పాస్టరు చేత ప్రధాన చేపిచ్చి గుంటలో పెడతావో లేకపోతే మాకు వూరితో సంబందం లేదని నీ ఇష్టప్రకారం చేసుకుంటావో నీ ఇష్టం. కాని వాళ్లు పల్లెల్లోకి వచ్చేరంటే మాత్రం నీకు ఏ పెళ్లిలో తాంబూలం ఇచ్చేదిలేదు, మీకు మన పల్లెకి  సంబంధం లేనట్టే. పాస్టరా ఇక ఇది మా మాట,” పైకే లేచేడు కులపెద్ద ఇశ్రాయేలు.

పాస్టరు కూడా పైకి లేసేడు.

“ఇంకేందిరా నీ సమస్య లేచి ఫో, సెప్పింది అర్థం కాలేదా లేకపోతే ఆ చర్చి నుంచి వెలేస్తారని భయపడుతున్నావా... ఏందిరా జాలా నోరు తెరిచి మాట్లాడు, మా నిర్ణయం ఇది. ఇక నీ ఇష్టం,” పైకి లేచేడు ఇంకోకుల పెద్ద తిమోతి.

“అట్టంటే ఎట్టలే కూసో బాబాయ్...” అన్నాడు చినజాలయ్య తరుపు బంధువు.

"సూడండి, మా తాత మా అయ్యా నేను ఈ సంఘంలో ఒక భాగం. నేను సంఘం వేరువేరు కాదు, మీ ఇష్ట ప్రకారంగా నిర్ణయాలు తీసుకుంటా వుంటే చూస్తా ఊరుకోవడానికి నేను మామూలు మనిషిని కాదు దైవజనుడుని. నేను ఇక్కడ వున్నప్పుడు ఇంకొకడెవడో వచ్చి నా సంఘంలో దూరతా వుంటే నేను చూస్తూ ఊరుకోవాలా? అందుకేనా మా కుటుంబమంతా మన సంఘాన్ని అంటిపెట్టుకొని వుంది ఇన్నాళ్లు. ఇది మంచిదికాదు మన సంఘానికి ఇది మంచిది కాదు," బాధపడ్డట్టు చెప్పేడు ఆ వూరి పాస్టరు అరుస్తా.

* * *

"ఒరి నాయ్యల్లారా ఆ సినజాలయ్యగోడు అనుకున్నంత పనిచేసేడురా," గసపెడతా వొచ్చేడు అనందుబాబు అరుగు దగ్గరికి.

"ఏమయ్యిందే" అంటా పైకిలేసేడు అయ్యన్న.

కుర్రోల్లంతా ఖంగారు ఖంగారుగా చూసేరు వాడివైపు.

"ఓ ఏసేబు మామో ఓ సుబ్బమామో... నాయాల్లారా ఆ పెంతికోస్తోల్లు రావడం... గుంటదియ్యడం... మనిషిని పూడ్చిపెట్టి ఎవురిల్లకి వాళ్లు ఎల్లడం కూడా అయిపోయిందిరా సాముల్లారా," అంటా అంత దూరంలో చెట్టుకింద కూర్చున్న కులపెద్దతో చెప్పేడు.

ఆడ ఈడ అచ్చనగన్నాలు ఆడుతున్న ఆడోల్లు, టీ బొంకులు కాడ కూకోని మాట్లాడుకుంటున్న మొగోళ్లు, చెట్లు కింద కూకోని ఫోన్లు నొక్కుకుంటున్న కుర్రోళ్లు ముసలీముతకా పిల్లాజెల్లా ఒక వందమందికి తగ్గకుండా గోలగోలగా అక్కడికి చేరుకున్నారు.

"ఒరే నాయాలో నువ్వు చెబతంది నిజమేనంట్రా," అన్నాడు ఆశ్చర్యంగా గుంపులోంచి కొండయ్య

"కావాలంటే సమాదుల దగ్గరకి పోయి చూడండే నా మాట వుట్టిదనుకుంటే," అన్నాడు అనందుబాబు.

"నాయాల్లారా అవ్వాయ్ సువ్వాయిలు మోగినప్పుడు పోవచ్చులే అని అట్ట కన్నుమూసా. అప్పుడే తీస్కపోయి యేశారా గుంటలో. చివరి సూపు కూడా సూడలేకపోతిమే," బాధపడ్డాడు రోశయ్య.

"ఎవురెవురి సావులుకో మన మాదిగోల్లు పోయి తప్పెట్లు కొడుతుంటిరే. అసలయిన మాదిగోడి సావుకి తప్పెట దరువులు లేకుండా చేసేరు కదరా ," అంటా సాన బాధపడిపోయేడు ఎంతమందినో తప్పెట దరువులతో సాగనంపిన ఎలీషా.

"అసె ఆ పెంతికోస్తు సంఘమ్మోళ్లకి తప్పెట్లు కొట్టడం అవ్వాయ్ సువ్వాయిలు కాల్చడం పూలు జల్లడం ఇష్టముండదంట. మనమొస్తే వాళ్లకేడ అడ్డ మొస్తామో అని గబాగబా తీస్కపోయి పూడ్చేసేరు. నేను అక్కడ్నుంచే వస్తున్నా," అన్నాడు ఆడకొచ్చిన రాజేషు.

"వాల్లెవురో మన పల్లెకొచ్చి చచ్చిన మనిషిని తీస్కపోతుంటే మన కులపెద్దలేమి చేస్తున్నార్రా సాముల్లరా," అంటా నిష్టూరపోయాడు ఏసురత్నం.

"మంచాల్లో ముడుక్కుండ్లా కూడ్లు తిని," నవ్వాడు అయ్యన్న.

అందరు గోలగోలగా నవ్వేరు.

"ప్రతోక్క నాకొడుక్కి సీమ సిట్టుక్కుమన్న కులపెద్దలే గుర్తుకొస్తార్రా ఈ పల్లెల్లో వాళ్లకి, కులపెద్దల మాట తూసా తప్పకుండా పాటిత్తున్నట్టు. అప్పుడికీ... మా మాట మీరితే తాంబూలం కూడా ఇయ్యమని ఖరాఖండిగా చెప్తిమే, కులం నుంచి ఎలేత్తా మని కూడా చెబితిమే మీ అందరిముందే. ఆ నాయాలు అయినా పోయేడంటే సూడు వాడికి ఆ సంగం పిచ్చి ఎంత తలకెక్కిందో," ఆవేశంగా చెప్పాడు కులపెద్ద హగ్గయ్య.

"అవున్రా చర్చికాడ మన పాస్టర్ లేడా? ఆయనెట్ట ఒప్పుకున్నాడ్రా? ఆయనొప్పు కోడనే ధీమాతోనే కదా మేమంతా ఇంటికొచ్చిందే," అన్నాడు సుగున్రావ్.

"అందరనుకుంది అదేకదా, వాళ్లొచ్చి బతిమలాడుతుంటే ఈయన కూడా చాల సేపటిదాకా ఒప్పుకోలా. వాళ్ల నుంచి తప్పించుకోవడానికి బండేసుకొని ఆ బజారుకి ఈ బజారుకి తిరిగేడు. కొంచెంసేపటికి ఏదో ఒక ఫోనొచ్చింది. అంతే టక్కున ఒప్పేసు కున్నాడు. ఆ ఫోన్ చేసిన్దెవురో ఈయనెందుకు ఒప్పుకున్నాడో ఒక్క ముక్క అర్థం కాల. అంతున లేపుకొనొచ్చేరు," చెప్పేడు రాజేషు.

"మరి గుంటకాడ ప్రార్థన చేసిందెవురు," అనడిగాడు పల్లు కొరుకుతా కంకర్రాల్ల గుట్టమీద కూసోని శేకరు .

"ముందు మన పాస్టరు ప్రార్థన చేసి మూడుసార్లు మట్టేసేడు. అక్కడున్న మనోళ్లు కొద్దిగమంది ఆ పాస్టరుతో పాటే మట్టేసేరు. తరువాత వాళ్లొచ్చి వాళ్ల బాసలో ప్రార్థన చేస్తా పెద్దపెద్దగా అరుస్తుంటే పాస్టరుతోపాటు మనోళ్లు అందరం నవ్వుకుంటా బయటికొచ్చేం. ఇక వాళ్లు కూడా ప్రార్థన చేసి మిగిలిని గుంటని కప్పి వెళ్లిపోయేరు," వివరించాడు రాజేషు.

"చచ్చిన మనిషిని రెండుసార్లు బూడ్చిపెట్టిన ఘనత మన పల్లెకే దక్కుతుంది సూడు, వూల్లూల్లు చెప్పుకుంటారు ఈ సరిత్రని," అన్నాడు సుట్ట సుట్టుకుంటా ప్రసాదు.


“ఓ మామో రెండుసార్లు బూడ్చిపెట్టటంకాదె. సూడు ఈ సంఘాలన్నీ కల్సి కమ్మగా కలిసున్న మన పల్లెని రెండు వర్గాలుగా విడగొట్టకపోతే సూడు,” అంటా వెర్రికోపంతోటి ఇంతలావు కంకర్రాయిని ఇస్సిరి నూకాడు శేకరు. అది కచ్చితంగా పోయి దూరంగా ఆపున్న పాస్టరు బండికి తగిలి బండద్దం పగిలింది.

“ఒరే దోవదప్పినోడో నీకెందుకురా ఎవురెట్టబోతే ఇది దేవుడు ఇషయంరా ఎట్టంటే అట్టమాట్లాడకూడదో...” అని, “దేవతండ్రీ ఏసయ్యా నా బిడ్డకి నీ గురించి తెలియక నిన్ను దూసిత్తనాడయ్యా, తెలియక చేసిన తప్పుల్ని క్షమించండి. వాడ్ని మీ రక్తంతో పరిశుద్ధపరచండి, మీ హస్తంతో ముట్టండి, వాడు మారుమనసు పొందేలాగను సహాయం దయచెయ్యమని మొరపెట్టుకుంటున్నాను తండ్రి, ఇదిగో దేవా తండ్రీ చేసిన తప్పులను పచ్చాతాపంతో ఒప్పుకుంటే మన్నిస్తానన్న గొప్ప దేవుడివయ్యా...” అక్కడే మోకాళ్లు వంచి ప్రార్థన చెయ్యడం మొదలుపెట్టింది శేకరోల్ల నానమ్మ.

అందరు కళ్లుమూసుకున్నారు.

*ఆంధ్రజ్యోతి ఆదివారం*
*15 డిసెంబర్ 2019*

*



21 అక్టోబర్ 1984న కందులూరు, ప్రకాశం జిల్లాలో పుట్టిన **ఇండ్ల చంద్రశేఖర్** మొదటి కథ **నేను నాన్న** *బిర్యాని* సాక్షి ఆదివారం సంచికలో 2014లో వచ్చింది. 15 కథలు అచ్చయ్యాయి. *రంగుల చీకటి* కథా సంపుటి వెలువరించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో పిహెచ్.డి. చేస్తున్నారు. ది ఆఘాఖాన్ అకాడమిలో డ్రామా టీచర్‌గా పని చేస్తున్నారు.

*చిరునామా: కందులూరు గ్రామము, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523 272*
*ఫోన్: 9912416123 chandrasekhar.indla@agakhanacademies.org*